## క్లుప్తంగా

### వర్గీకరణను వ్యతిరేకించడం తగదు


తెన్నేటి సురేష్

నరసాపురం: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెన్నేటి సురేష్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్ చేయడం, సుప్రీం కోర్టు తీర్పును రాజ్యాంగ వ్యతిరేకమని మాల సోదరులు పేర్కొనడం చాలా తప్పని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 అతిక్రమణ జరగదన్నారు. వర్గీకరణ ద్వారా రిజర్వేషన్ ఫలాలు అర్హులందరికీ సమానంగా దక్కుతాయని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై కొంతమంది స్వార్థంతో అడ్డుకుంటున్నారని అన్నారు.

### కమిటీలో బాధ్యతగా వ్యవహరించాలి


ఐసీడీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు అనితకుమారి

పెనుగొండ: బాల్య వివాహాల నిరోధానికి గ్రామాల్లో కమిటీలు బాధ్యతతో వ్యవహరించాలని పెనుగొండ తహసీల్దారు జి.అనితకుమారి అన్నారు. బుధవారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీఎంపీఓ ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాల్య వివాహాలను నివారించడంలో కమిటీ ప్రాధాన్యతను వివరించారు. బాల్యవివాహాల వల్ల ఎన్నో నష్టాలు ఎదురవుతాయన్నారు. బాల్యవివాహాల వల్ల లైంగిక వేధింపులు, సమస్యలు అర్థం కాకపోవడం వంటి వాటితో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. వీటిని వారి తల్లిదండ్రులకు వివరించి బాల్య వివాహాల నిరోధానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ దొర, ఎల్‌సీపీఓ విజయ, ఎంఈఓ డి.శుభాకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి


మొగల్తూరులో పురుగు మందును పిచికారీ చేస్తున్న రైతు

మొగల్తూరు: వరి సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు ఎరువులు, పురుగు మందులు విరివిగా వాడవద్దని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ కోరారు. బుధవారం మొగల్తూరు పంచాయతీ పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, ఇంజేటివారి పాలెం ప్రాంతాలలో పర్యటించి వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఎరువులు వాడకం వల్ల దిగుబడి తాత్కాలికంగా పెరిగినా రాబోయే రోజుల్లో దిగుబడి తగ్గిపోయే ప్రమాదముందన్నారు. రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాతావరణంలో మార్పులు, మబ్బులు కారణంగా పండు ఆకు తెగులు, పచ్చ పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. రైతులు వీటి నివారణకు ఎకరాకు జింక్ 200 గ్రాములు, క్లోరిపైరిఫాస్ 400 మిల్లీ లీటర్ల మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

### బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చేసినా, వారిని ప్రోత్సహించినా చట్టపరంగా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని భీమవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరం మండలం అనాకోడేరులో అంగన్ వాడీ సెంటర్‌లో బుధవారం 100 రోజుల పాటు జరిగే మిషన్ శక్తి పథకంలో భాగంగా బాల్యవివాహాలు, మహిళలపై అత్యాచారాలు, వేధింపులు, దాడులపై అవగాహన కల్పించారు. లక్ష్మీకాంతం మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వాలు చట్టాలు ద్వారా భద్రత కలిస్తున్నట్టు చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే పౌష్టికాహారంపై హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

### భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

ఉండి: తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ శివారు ఖండ్రిక ప్రాంతానికి చెందిన పసుపులేటి సీతామహాలక్ష్మి తన భర్త (47) ప్రభాకరరావుకు మతి స్థిమితం లేదని, ఆయన ఈ నెల 17న రాత్రి భోజనం చేసి పడుకున్న అనంతరం ఉదయం లేచి చూసేసరికి ఆయన కనిపించలేదని తెలిపారు. ఆయన ఆచూకీ కోసం చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదుపై ఎస్సై ఎండీ నజీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈ-పంట..మోగేను గంట

- ఈ-క్రాప్ నమోదు పొలాల బాట పట్టిన వ్యవసాయాధికారులు
- ఈ-పంట నమోదుతో లాభాలెన్నో..!


శిరగాలపల్లిలో ఈ పంట నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకురాలు

యలమంచిలి: రైతులకు ఈ-పంట నమోదుకు సమయం ఆసన్నమైంది. విత్తనాల ఎంపిక నుంచి పండించిన పంట మార్కెట్‌కు తరలించే వరకు అన్నదాతలకు అవసరమైన అన్ని రకాల సేవలు, సహాయం రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు ఏర్పడిన సమయంలో రైతులను ఆదుకునేందుకు గత ప్రభుత్వంలో ఈ-క్రాప్ పేరిట ఈ విధానం ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఈ-పంటగా పేరును మార్చారు. ఈ విధానంలో రైతులు ఏ విధమైన పంట, ఎంత విస్తీర్ణంలో పండించారో స్పష్టంగా నమోదు చేస్తారు. గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించి ఈ-పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు.

**పంట నమోదులో మరింత పారదర్శకత..**

ఈ-పంట నమోదు విధానంలో రైతులు తాము సాగు చేసే భూమిలో ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. ఊడ్పులు పూర్తవ్వగానే ఆధార్, పంట రకం, విత్తిన తేదీ వివరాలను కొత్త యాప్‌లో నమోదు చేస్తారు. అనంతరం యాప్‌లో నమోదు చేసిన ప్రతి సర్వే నెంబర్ దగ్గరకు వెళ్లి జియో కార్డినేట్స్ ద్వారా ఫోటో తీస్తారు. ఈ విధంగా రైతులు పంట నమోదు సక్రమంగా చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే సబ్సిడీలు అందుతాయి.

**రైతులకు అందే ప్రయోజనాలివే**

రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయించుకోవడం వల్ల పంటల బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా, వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్లు మంజూరు వంటి ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ-పంటలో భాగంగా రైతు సేవా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతి రైతు భూమి, గ్రామం, సర్వే నెంబరు, ఆధార్, పంట వివరం, నాట్లు వేసిన తేదీ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు. దీంతో పంట అమ్మే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరమవుతుంది.

### పంట నమోదు కొంచెం ఆలస్యం..



రైతులకు ఎంతో మేలు చేసే ఈ-పంట నమోదు కార్యక్రమం ఇప్పుడే ప్రారంభించాం. అధిక వర్షాలు, వరదల వల్ల ఈ ఏడాది ఊడ్పులు ఆలస్యమయ్యాయి. పూర్తి స్థాయిలో ఇంకా నాట్లు కూడా పడలేదు. అయితే సెప్టెంబర్ 20 లోపు ఈ పంట నమోదు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ-పంట నమోదు ప్రారంభించాం. విత్తు నుంచి విక్రయం వరకు మేలు చేసే ఈ-పంట నమోదును రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.

– ఈది అనిలకుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు

### ఈ-పంట నమోదుతో రైతులకు ప్రయోజనం



ఈ-పంట నమోదు కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు అందుతుంది. ప్రకృతి విపత్తుల వల్ల పంట దెబ్బతిన్నా రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా నష్ట పరిహారం సాగు చేసే రైతు ఖాతాలో నేరుగా జమవుతుంది. కౌలు రైతులకు ఈ-పంట నమోదు వల్ల మరింత ప్రయోజనం చేకూరుతుంది.

– బొంతు వెంకట కర్నారెడ్డి, రైతు, చింతదిబ

# చెరువులుగా మారుతున్న పొలాలు

**ఆక్వా సాగు వైపు మొగ్గు చూపుతున్న రైతులు**


రామన్నపాలెంలోని వ్యవసాయ భూమి.


చెరువుగా మారిన వ్యవసాయ భూమి.

మొగల్తూరు: పచ్చని తివాచీ పర్చుకున్నట్టుగా ఉండే వ్యవసాయ భూములన్నీ చెరువులుగా మారుతున్నాయి. మండలంలో సంవత్సరంలో రెండు పంటలు పండే భూములన్నీ చెరువులుగా మారుతున్నాయి. సాగునీరు అందకపోవడం, పండిన పంటకు గిట్టుబాటు లేదని, కూలీల వేతనాలు, వాతావరణ మార్పులతో పండిన పంట చేతికి అందడం లేదనే కారణంతో పచ్చని భూములను ఆక్వా చెరువులుగా మారుస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని రామన్నపాలెం, శేరేపాలెం, కాళీపట్నం గ్రామాల్లోని భూములన్నీ చెరువులుగా మారుతున్నాయి. జిన్నూరు కాలువ శివారు ప్రాంతాలైన శేరేపాలెం, కొత్తపాలెం, నవుడూరు గరువు, రాజకోడు ప్రాంతాల్లో సుమారు 1500 ఎకరాల్లో వ్యవసాయ భూముల్లో వెయ్యి ఎకరాలు చేపలు, రొయ్యల చెరువులుగా మారాయి. శివారు ప్రాంతమైన తమ గ్రామాల్లో నీరందడం లేదని, నీరందినా సమీపంలోని గొంతేరు డ్రెయిన్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఉప్పునీరు చెరడంతో సాగు చేయలేకపోతున్నామనే నెపంతో పచ్చని పొలాలను చెరువులుగా మారుస్తున్నారు.

**ప్రతి ఏటా తగ్గుతున్న సాగుభూమి**

దర్భరేవు డ్రెయిన్ పరివాహక ప్రాంతాలైన రామన్నపాలెం పంచాయతీ అడవిపల్ర ప్రాంతంలో ఒకప్పుడు సుమారు 2 వేల ఎకరాల్లో సాగుచేసేవారు. ప్రస్తుతం 100 ఎకరాలకు పడిపోయింది. ఇక కాళీపట్నం మాగిలేరు ప్రాంతంలో సుమారు 600 ఎకరాల్లో సాగు చేసేవారు. ప్రస్తుతం 600 ఎకరాలు కూడా చెరువులుగా మారిపోయాయి. మండలంలోని సుమారు 5 వేల ఎకరాల్లో దాళ్వా సాగు, 4వేల ఎకరాల్లో సార్వా సాగు అమల్లో ఉండేది. ప్రస్తుతం ఈ ఏడాది చూసుకుంటే కేవలం 1398 ఎకరాలకు సార్వా సాగు తగ్గిపోయింది. అంతేకాక సుమారు ఐదు వేల ఎకరాల్లో అధికారికంగానూ, అనధికారికంగా మరో 5 వేల ఎకరాల్లోనూ చేపలు, రొయ్యల సాగు చేపట్టారు. ఈ సాగుకు ఖర్చు అధికంగా ఉన్నా రైతులు ఆక్వా సాగుకే మొగ్గు చూపుతున్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, పండిన పంట చేతికి అందే వరకూ నమ్మకం లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

**పెరుగుతున్న మట్టి అమ్మకాలు**

మరోవైపు గత రెండు, మూడు సంవత్సరాలుగా చూసుకుంటే జాతీయ రహదారి, రైల్వే ట్రాక్ పనులకు సంబంధించి మట్టికి గిరాకీ పెరిగింది. దీంతో అవసరం ఉన్నా లేకున్నా పచ్చని పొలాల్లో మట్టిని అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు. చెరువు తవ్వకునేందుకు ఖర్చులు కలిసి రావడంతో లాభసాటి బేరంగా మారడంతో పెద్ద ఎత్తున రైతులు తమ భూములను చెరువులుగా మార్చేస్తున్నారు. అధికారుల అనుమతి ఉన్నా లేకున్నా రాజకీయ పలుకుబడితో ఇష్టారాజ్యంగా చెరువులు తవ్వేస్తున్నారు. అధికారులు చూసి చూడనట్టు వదిలేయడంతో మూడు భూములు, ఆరు చెరువులుగా మారుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగుతే రానున్న రోజుల్లో గుప్పెడు అన్నం మెతుకులు తినేందుకు కూడా వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి పచ్చని పంట పొలాలను చెరువులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

### చేలల్లో నీరు నిలిచిపోవడంతో..



శివారు ప్రాంతాలకు నీరందకపోవడంతో తమ ప్రాంతంలోని వ్యవసాయ భూములన్ని చెరువులుగా మారాయి. దర్భరేవు డ్రెయిన్ ఆటుపోటులకు చేలలోకి నీరు చేరి బయటకు పోకపోవడంతో చెరువుల వైపు మళ్లాం. నీరందకపోవడం, పండిన పంటకు గిట్టుబాటు లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీంతో రైతులు చెరువులు వైపు దృష్టి సారిస్తున్నారు.

– పిప్పళ్ల గోపి, పిప్పళ్లవారితోట,

### నీరందకే ఇబ్బంది



మా గ్రామంలో చాలా మంది రైతులు వ్యవసాయంపైనే ఆసక్తి చూపేవారు. అయితే మాగిలేరు ఆటుపోటుకు ఉప్పునీరు చేలలోకి చేరడంతో పాటు కాలువ నీరు పుష్కలంగా అందదు. దీంతో వ్యవసాయ రైతులు ఆక్వా రైతులుగా మారారు.

– దొంగ నాగముని, కాళీపట్నం

# ఆక్వా సాగులో మెలకువలు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపెడా సిబ్బంది

నరసాపురం రూరల్: ఆక్వా సాగులో మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడం సాధ్యమవుతుందని రీజనల్ కో ఆర్డినేటర్ చంద్ర శేఖర్ అన్నారు. మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంపెడా సహకారంతో నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఆక్వా కల్చర్ (నాక్సా) ఆధ్వర్యంలో నరసాపురం మండలం రాజుల్లంక గ్రామంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆక్వా కల్చర్‌లో మెరుగైన నిర్వహణ, యాజమాన్య పద్ధతులు, వైవిధ్యీకరణ అనే అంశంపై గత నాలుగు రోజులుగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో 20 మంది షెడ్యూల్డ్ కులాల రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా శిక్షణను ఇస్తున్నట్లు నాక్సా ఫీల్డ్ మేనేజర్ ఎ.భువన పేర్కొన్నారు. ఈ శిక్షణలో సీడ్ ఎంపిక, నీటి పరీక్షలు, వైరస్‌లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలపై అవగాహనను కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు తాడి సత్యనారాయణ, ఎ.వెంకటరమణ, వై.సూరిబాబు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### లోక్ ఆదాలత్‌ను వినియోగించుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఈనెల 14న జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల మధ్య రాజీ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు.

# గ్రామాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి


యలమంచిలి: రైతు సేవా కేంద్రం వద్ద సమావేశమైన సర్పంచ్‌లు, అధికారులు

యలమంచిలి: గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి కోరారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన పునశ్చరణ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పనులు చేయడం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడమే కాకుండా, అభివృద్ధి పనులకు ఎక్కువ నిధులు మంజూరు అవుతాయన్నారు. కనుక ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం ఫీల్డ్ విజిట్ చేసి రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు, కొండేటి జీవరత్నం ఈఓపీఆర్డీ షేక్ అమీర్ షరీఫ్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ గుబ్బల శ్రీనివాస్ గ్రామ కార్యదర్శులు అడబాల కోదండరామయ్య, మాదాసు హరిప్రసాద్, తోలేటి పార్వతి, పీతల రాజశేకర్, తోటకూర పవన్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

**వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండాలి**

మొగల్తూరు: గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాట్లు, నిర్వహణపై సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ వి.బాబ్జిరాజు సూచించారు. మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల శిక్షణా తరగతుల్లో భాగంగా మూడో రోజు బుధవారం ఎంపీడీవో బాబ్జిరాజు మాట్లాడారు. గ్రామ స్వరాజ్ పోర్టల్, 1994 సెక్షన్ 80,81 సీసీ చార్జీల చెల్లింపులు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వీధి దీపాల నిర్వహణపై ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన వాటిల్లో వీధి దీపాల నిర్వహణ కూడా ఒకటన్నారు. వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణపై సర్పంచ్‌లకు వివరించారు. అనంతరం మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లకు సర్టిఫికెట్లను అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు ఈటీపీఈ ఆర్ నవీన్ కిరణ్, కేవీఎస్ రాజు, వై.శ్యాం, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు మహిళలకు ఉచిత వైద్య శిబిరం

పాలకొల్లు సెంట్రల్: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు జక్కంపూడి మదన్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మఠం వీధిలో ఉన్న మన్యం జగ్గమ్మ సత్రంలో ఈ ఉచిత వైద్య క్యాంపు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో మణిపాల్ సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం సభ్యులు మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ల స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన సదస్సు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లబ్ సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, శిరిగినీడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

### లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యలమంచిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హత ఉన్న లెక్చరర్స్ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఐ.నాగజ్యోతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటనలో విడుదల చేశారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ 50 శాతానికి పైబడి మార్కులు సాధించిన అభ్యర్థులు ఈ నెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు చేసిన వారంతా 24వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సంబంధిత సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని ఆమె కోరారు.

### రేపు ఉపాధి హామీపై గ్రామ సభలు

పాలకోడేరు: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నూకల మురళిగంగాధర్ రావు తెలిపారు. ఈ గ్రామ సభల్లో కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని రోజుకు రూ.300 దినసరి వేతనం లభించేలా కొలతలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. గ్రామంలో చేపట్టాల్సిన కొత్త పనులను గుర్తిస్తారని ఎంపీడీవో తెలిపారు. కొండేపూడిలో ఉదయం 10 గంటలకు, విస్సాకోడేరు, మోగల్లు, గొల్లలకోడేరులో ఉదయం 10.30, గొరగనమూడి, గరగపర్రు, వేంద్రలో ఉదయం 11.30, వేంద్ర అగ్రహారం, పెన్నాడ అగ్రహారంలో మధ్యాహ్నం 12.30 గంటలకు, శృంగవృక్షం, మైపలో మధ్యాహ్నం మూడు గంటలకు, కుముదవల్లి, పాలకోడేరులో మధ్యాహ్నం రెండున్నర గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామ సభలకు జాబు కార్డు కలిగిన లబ్ధిదారులు , గ్రామ ప్రజలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

# భారత్ బంద్ ప్రశాంతం


ఆచంట: కచేరీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ సంఘాల నాయకులు


పాలకొల్లు సెంట్రల్: బంద్‌లో పాల్గొన్న మాలమహానాడు ఐక్య జేఏసీ నాయకులు



నరసాపురం: బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న మాలల న్యాయపోరాట సమితి నాయకులు

నరసాపురం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన బంద్ నరసాపురంలో విజయవంతమైంది. మధ్యాహ్నం 12 గంటలు వరకూ బంద్ సంపూర్ణంగా సాగింది. ఆర్టీసీ బస్సులు కదల్లేదు. విద్యా సంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి. అన్ని దుకాణాలు మూతపడ్డాయి. పెట్రోల్ బంక్‌లు, బ్యాంకులు కూడా మూతపడ్డాయి. నరసాపురం నియోజకవర్గ మాలల న్యాయపోరాట సమితి నాయకులు తెల్లవారు జామునే బస్టాండ్ వద్దకు చేరుకుని రోడ్డుపై టెంట్ వేసి బైఠాయించారు. ఆర్టీసీ బస్సులు కదలనీయకుండా అడ్డుకున్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి దుకాణాలు మూయించి వేశారు. ఈ సందర్భంగా మాలల న్యాయపోరాట సమితి నరసాపురం నియోజకవర్గ అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనంద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ జరిగితే మాలలు హక్కులు కోల్పోతారని అన్నారు. సుప్రింకోర్టు తీర్పు సహేతుకంగా లేదన్నారు. కార్యక్రమంలో మాలల న్యాయపోరాట సమితి నాయకులు కొల్లాబత్తుల రవి, అడిదల శరత్, రూబెన్, డి.హెన్రీ, వర్ధనపు ఏసురత్నం, నేతల రమేష్, గోరింకల వినోద్, మాజీ ఏఎంసీ చైర్మన్ దొండపాటి స్వాములు, బొల్లవరపు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**మొగల్తూరులో..**

మొగల్తూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాల మహానాడు, ఇతర సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. మొగల్తూరులో ఉదయం నుండి దుకాణాలు, హోటళ్ళు మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, పాఠశాలలను మాలమహానాడు కార్యకర్తలు నాయకులు మూసివేయించారు. మాల మహానాడు మండల అధ్యక్షులు కుమార స్వామి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు వర్గీకరణ వల్ల జరిగే నష్టాలను వివరించి మాలలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వడ్లమూడి శ్రీను, వర్ధనపు సుధాకర్, ఇంజేటి దానం, నల్లి నాగరాజు, ఇంజేటి రాజు, వేగి రాజశేఖర్ పాల్గొన్నారు.

**యలమంచిలిలో..**

యలమంచిలి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకిస్తూ మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన భారత్‌బంద్ కార్యక్రమం యలమంచిలి మండలంలో విజయవంతమైంది. చించినాడ, మేడపాడు, దొడ్డిపట్ల గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో రాస్తారోకోలు చేసి వాహనాలను నిలిపివేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఉచ్చుల స్టాలిన్, మోకా నరసింహారావు, విప్పర్తి నవీన్, బుంగా జయరాజు, పోలుకొండ వెంకట్, పితాని పుష్పరాజు, ముడకల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

**పాలకొల్లులో...**

పాలకొల్లు సెంట్రల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో ఇచ్చిన భారత్ బంద్‌కు వ్యాపారస్తులు పూర్తిగా సహకరించడంతో బంద్ విజయవంతమైంది. బుధవారం బంద్ కారణంగా విద్యా సంస్థలు సెలవు ప్రకటించగా, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, కళాశాలలు బంద్‌కు సహకరించారు. వ్యాపార సంస్థలు సాయంత్రం 5 గంటల వరకూ మూసేవేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జేఏసీ నాయకులు గుమ్మాపు సూర్యవరప్రసాద్, నల్లి రాజేష్, మానుకొండ శ్రీనుబాబు, ఉచ్చుల స్టాలిన్, కోట రత్నరాజు, మద్దా చంద్రకళ, విప్పర్తి ప్రభాకర్, మేకా నరసింహారావు, కొప్రపాటి వీరాస్వామి, దేవ రాజేష్, పితాని పుష్పరాజ్, ఉప్పే పండు, బండి సుందరరామ్మూర్తి పాల్గొన్నారు.

**ఆచంటలో..**

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణకు అనుకూలం సుప్రీం కోర్టును వ్యతిరేకిస్తూ ఎస్సీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన భారత్ బంద్ ఆచంట, సిద్ధాంతం, ఇలపర్రుల్లో విజయవంతమైంది. ఆచంట మండలం ఆచంటలో ఎస్సీ సంఘాల నాయకులు నిరశన వ్యక్తం చేసి, దుకాణాలను పాఠశాలలను మూయించి వేసి కచేరీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఆచంట పెదపేట చైతన్య యువజన సంఘం, మాలమహానాడు, ఇతర సంఘాల నాయకులు ఎస్సీ సేవా సంఘం నాయకులు నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సుంకర సీతారామ్, మట్టా ఆనంద్ కుమార్, కోట వెంకటేశ్వరరావు, భీరా నరసింహమూర్తి, సరేళ్ల శ్రీనివాస్, పారుపల్లి సుందర్ పాల్ పాల్గొన్నారు. సిద్ధాంతంలో ఎస్సీ, ఎస్టీ, బహుజన సంఘాల నాయకులు,, ఇలపర్రులో మాల మహానాడు ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు.

**పోడూరులో..**

పోడూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో భారత్ బంద్ పిలుపుమేరకు బుధవారం మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మాలమహానాడు కార్యకర్తలు బంద్ నిర్వహణలో పాల్గొన్నారు. పోడూరు, జిన్నూరు, కవిటం, పెనుమదం, మట్టపర్రు, గుమ్మలూరు తదితర గ్రామాల్లో మాలమహానాడు కార్యకర్తలు బంద్ నిర్వహించారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు కొప్రపాటి వీరాస్వామి, గౌరవాధ్యక్షుడు బుడితి భీమారావు, కార్యదర్శి గొట్టుముక్కల ఏసురత్నం, జిల్లా కార్యదర్శి పోతుమూడి రామచంద్రరావు, తరపట్ల మోహనరావు, పుచ్చకాయల ప్రసాద్, కందికట్ల వెంకట్రావు పాల్గొన్నారు.